# అజ్ఞానానికి మరో అంచు

చదువు లేక ఉన్న మెదడును వాడుకోలేకపోవడం... దౌర్భాగ్యం !

- జయప్రద

"ఎనిమిదో నెలట... నెప్పులతో ఒక పేషంటు వచ్చింది మేడమ్!"

– ఒ.పి. పూర్తిచేసి వెళ్లబోతుంటే... లోపలికొచ్చి చెప్పింది నర్స్.

నా అలసట నిట్టూర్చింది.

'నీకు డబ్బు ఆశ జాస్తి... ఆరోగ్యం గురించే పట్టించుకోవు!' అని ఎప్పుడూ విమర్శించేది నా ప్రాణస్నేహితురాలు. నేను ఆరోగ్యంగానే వున్నాను. ఆమె మాత్రం నన్ను విడిచి, ఈ లోకాన్ని విడిచి వెళ్లిపోయి... అప్పుడే అర్ధసంవత్సరం గడచిపోయింది. ఇంకా బ్రతికున్నట్టే అనిపిస్తుంది, అలా విమర్శిస్తున్నట్టే వుంటుంది.

నిజమే... డబ్బు చాలా లోభనీయమైంది- ఒప్పుకుంటాను. కానీ, ఆ డబ్బును వద్దనుకునే క్షణాలు కూడా కొన్ని వుంటాయి. అలాటి వాటిల్లో ఇది ఒకటి.

నిరాశను బాధ్యతతో కప్పెట్టి.., లేచాను.

●

"ఏమ్మా... ఎప్పటినుండి నొప్పులు?"

"రాత్రి నుండి..." మూలుగుతూనే జవాబు చెప్పింది నా పేషంటు రుక్మిణి.

"నేను ముందే చెప్పాను కదమ్మా... ఏమాత్రం బాగలేకపోయినా వెంటనే రావాలని?!"

ఆ అమ్మాయి కనురెప్పలు వాల్చింది. ఆమె అందం సగం ఆమె కాటుక కళ్ళల్లో వుంది. మిగతా సగం ఆమె నల్లటి దేహఛాయలో వుంది.

పేషంటు అందాన్ని అభివర్ణించే టైమా ఇది?!

నా మనసుకు శుద్ధం బద్ధం లేదని తల విదిలించుకుని ప్రక్కకు తిరిగాను.

అక్కడ ఓ అరవై డెబ్బై ఏళ్ల వృద్ధురాలు నిల్చుని, నా వైపు కొద్దిపాటి ఆందోళనతో చూస్తోంది. ఆమె ఒంటిమీద జాకెట్టు లేదు. ఎఱ్ఱరేకు చీర కట్టుకోనుంది.

'భర్త పోయిన తర్వాత జాకెట్టు వేసుకోకపోవటం' అనే సంప్రదాయం అంత గొప్పదా?' ...నా మనసు మరలా గొణిగింది.

నా ఈ ఆలోచనలన్నీ ఫ్రాక్షన్ ఆఫ్ ఎ సెకండ్‌లో దొర్లిపోయుండొచ్చు. కాలం వృధా కాకపోయినా... ఒక పని చేస్తున్నప్పుడు ఈ మెదడుకు మరో ఆలోచన ఎందుకు వస్తుందో బోధపడదు.

ఇప్పుడేవిటి? నా చెల్లెలు చనిపోయినప్పుడు కూడా నాకు ఇలాటి లౌకిక ఆలోచన లెన్నో వచ్చేవి. నా మీద నాకే కోపం వచ్చేది.

'ఎక్కడ నుండి ఎక్కడికి వెళ్ళిపోతున్నాను నేను?!' తల విదిలించుకుని చేతికి గ్లౌ వేసుకున్నాను. నిజానికి- పద్ధతి ప్రకారం అయితే... మొదట పేషంటు తాలూకు గర్భస్థ శిశువు ఎలావుందో చూడాలి. కానీ, నా ఆత్రుత నాది! లోపలి శిశువు తన మాతృగర్భంలో డెవలప్ అవ్వాల్సింది- పూర్తిగా డెవలప్ కాకుండానే ఈ భూమ్మీదకు రావడానికి తొందరపడితే తొందరపడు గాక... కానీ, ఆ శిశువు మానసిక, శారీరక ఆరోగ్యం బాగుండాలంటే... మరికొన్నాళ్లు ఆ శిశువును ఈ కొత్తగోళంలోకి రాకుండా నేను ఆపాలి.

నేను అన్ని పరీక్షలు చేయడం పూర్తయింది. కడుపులో బిడ్డ గుండె లయబద్ధంగా కొట్టుకుంటోంది. కానీ, ఆ బిడ్డను ఆహ్వానిస్తూ గర్భద్వారం ఓపెన్ అయివుంది.

"ఎట్టా వుంది తల్లె?!"

నేను జవాబు చెప్పకముందే మరలా తానే అంది-

"మొన్నకాణ్ణే ఎనిమిదో నెల పెట్టింది. ఇంకా నాలుగు నాళ్లు ముందే కాన్పయ్యుణ్ణా బాగుణ్ణేది!" నిట్టూర్చిందా పెద్దామె.

'సైన్స్ పట్ల అవగాహన లేని పేషంట్లు ఇంకా వర్ధిల్లుతూనే వుండడం మన దేశానికి ఎంత సిగ్గుచేటు?!'

ఆమెను లోపలికి పిలిచాను.

"చూడమ్మా! ఏడో నెలలో బిడ్డ ఎదిగినదాని కంటె ఎనిమిదో నెలలో అన్ని అవయవాలు మరికొద్దిగా ఎదిగుంటాయేగాని, ఏడో నెలలో కంటె హీనంగా వుండవు. అయినా.. ఇంకా బిడ్డ ఎనిమిది వారాలు కడుపులో ఎదగాలి..."

నేనింకా చెప్పడం ఆపనే లేదు... ఆమె మొదలెట్టింది-

"ఎదగాలంటే మనిష్టమా? ఆ పైన బగమంతుడెట్టా చేస్తాడో..?!"

"భగవంతుడు ఏం చేస్తాడో నాకు తెలీదు కానీ, మీరు ఆమెను అడ్మిట్ చేస్తే... నొప్పులు తగ్గించే మందులు వాడుతాను" అన్నాను నవ్వుతూ.

"ఆస్పత్రిలో వుండాలా?... మందులు వాడాలా?! అమ్మోఁ... ఖర్చవుద్ది!"

నేను నా సీట్‌లో కూర్చున్నాను.

"ఖర్చవుతుంది కానీ, ఇప్పుడే బిడ్డ పుడ్తే... ఆ తర్వాత బిడ్డను బాక్స్‌లో పెట్టి చాకాలి. దానికీ ఖర్చవుతుంది కదా! పైగా, డెవలెప్‌మెంట్స్ బాగలేకపోతే బిడ్డ ఎదిగేకొద్దీ మందులకు ఖర్చవుతూనే వుంటుంది..." విశదంగా చెప్పాను.

ఆమె ఆలోచనలో పడింది... అయోమయంగా చూసింది.

నేను మరలా నోరు విప్పాను- "నొప్పులు ఆపగలమా, లేదా... అని గ్యారంటీ చెప్పలేము. కానీ, ప్రయత్నం చేయాలి కదా?"

మా బాధలు మావి! తీరా యుటోడ్రిన్ డ్రిప్‌కి కూడా నొప్పులు తగ్గకపోతే... కేవలం డబ్బు గుంజడానికే అడ్మిట్ చేసుకుంటున్నట్టు భావించే అమాయకత్వం వాళ్ళది. డాక్టర్‌ని నిలదీసి అడిగే రోజులివి... సైన్స్‌పట్ల సంధియుగం ఇది. ఆ రోజుల్లో- 'మీరు మాత్రం దేవుళ్ళా? మా ఖర్మ ఇలా వుంది!' అని సరిపెట్టుకునే అజ్ఞానం. అయితే... 'నొప్పులు ఆపలేనప్పుడు- మా చేత డబ్బెందుకు ఖర్చు పెట్టించాలి?' అనే మిడిమిడి జ్ఞానం ఇది.

"తగ్గకపోతే ఎట్టామ్మా?" బిడ్డ కావాలనే గాఢమైన కాంక్షలో నుండి పుట్టిన అమాయకపు ప్రశ్న ఇది.

"తగ్గకపోతే కాన్పు చేస్తాం... బిడ్డను బాక్స్‌లో పెట్టి బ్రతికించడానికి ప్రయత్నిస్తాం."

"అన్నిటికీ ప్రయత్నిస్తానంటే ఎట్టా? అంతమాత్రానికి ఇంటికే తీసుకెళ్తే... అక్కడే కనదా?" ఇది అజ్ఞానం చిక్కబడి వెలువడిన అమాయకత్వం.

"ఇక్కడ కాన్పయితే... పిల్లల డాక్టర్లూ, బాక్సులూ... బిడ్డ బ్రతకడానికి అవకాశం వుంటుంది కదా!" నర్స్ వివరించింది.

'ఈ 'హాఫ్ నాలెడ్జ్' కంటే ఆ అజ్ఞానమే మేలు!' అనుకునేంతగా మమ్మల్ని దిగజారుస్తున్న కాలం ఇది! పేషంట్సు అజ్ఞానంలో వున్న కాలంలో వాళ్ళ విశ్వాసంలో నుండి పుట్టిన ధైర్యంతో ఇవ్వాల్సిన ట్రీట్‌మెంట్‌ని- సిన్సియర్‌గా, నిర్భయంగా ఇచ్చే వాళ్ళం. కానీ, ఇప్పుడు పేషంటు కాస్త అటూఇటుగా వుంటే... ఆ పేషంటుకు ట్రీట్‌మెంట్ ఇవ్వడానికి వెనకాడుతున్నాం.

పేషంట్సులో జ్ఞానం పెరగాలి. పేషంటుకీ, డాక్టర్‌కీ మధ్య ఆ అజ్ఞానపు కాలంలో వున్న నమ్మకం- మరలా పూర్తిగా జ్ఞానం సంతరించుకున్నాక తిరిగి జన్మించాలి. ఆ రోజు రావాలి. అంతవరకు పేషంట్సుకు అయోమయావస్థ, డాక్టర్లకు నిరోమయావస్థ తప్పదు.

నిట్టూర్చాను నేను.

"అట్టాంటావా?" క్షణం ఆలోచించి మరలా అంది...

"సరే అయితే... వుంచుకో!"

"నొప్పులు ఆగిన తర్వాత కుట్టు వేసి గర్భద్వారాన్ని బంధించాలి. లేకపోతే నొప్పులు మరలా వస్తే కాన్పయి పోతుంది. ఈ ఖర్చు, శ్రమ అంతా వేస్ట్ అయిపోతుంది."

మమ్మల్ని మేము కాపాడుకోవడానికి వాళ్ళకు అర్థమయ్యేదాకా విశదంగా చెప్పడం అలవాటైపోయి- మా గొంతుల్లో సౌకుమార్యం నశించిపోతోంది.

ఆమె ఏమీ మాట్లాడలేదు. డాక్టర్స్ మరేదైనా మాట్లాడితే దాంట్లో లాజిక్ లాగి హాస్పిటల్ 'స్టే" ఆపుకోవచ్చునే తెలివితేటలు... పాపం ఆమెకు వున్నట్టు లేదు. కేవలం ఆమె పేదరికం ఆమెనలా మౌనంగా నిలబెట్టింది.

సిస్టర్ దగ్గరకు అడ్మిషన్ స్లిప్‌తో పంపించాను.

పాపం... జనరల్ వార్డే తీసుకుంది.

●

మరునాటికల్లా రుక్మిణికి నొప్పులు ఆగిపోయాయి.

విజయం మనిషికి ఎంతటి ఆనందాన్నిస్తుందో... నాకు అర్థమయిన మరో క్షణం అది.

"నొప్పులు తగ్గిపోయాయి కనుక- ఈరోజు సర్వైకల్ స్టిచ్ వేస్తాను..." అనగానే-

మానవ బాంబును చూసినట్టుగా తృళ్ళిపడింది రుక్మిణి.

ఆమె అమ్మ, ఆమెతో పాటు అమ్మమ్మా... అందరూ సైలెంట్ అయిపోయారు. వాళ్ళ మౌనం వెనక భావం ఇది...

'ఆపరేషన్ మాకు ఇష్టం లేదు.'

అవసరమైన ఇలాటి ఆపరేషన్‌కు వెనకడుగు వేస్తూ... అవసరం లేని గర్భసంచి తీసే ఆపరేషన్స్‌కు ఆనందంగా ముందుకు వస్తున్న జనంలోని ఈ అజ్ఞానానికి విముక్తి ఎప్పుడో?!

అనవసరమైనవన్నీ నా మెదడుకే కావాలి! దాన్ని తిట్టి, తలతిప్పి చూశాను.

ఆ వృద్ధురాలు నోరు విప్పింది-

"ఎల్లుండొస్తాము..గుడ్డలూ, ఇల్లూ అవీ సర్దుకోవాలంటోందీ పిల్ల!"

'పిల్ల' అంటే... ఫుల్ బెడ్ రెస్ట్ తీసుకోవాల్సిన పేషంటు.

డాక్టర్ ట్రీట్‌మెంట్ పట్ల అసంతృప్తి వున్నవాళ్ళు... ఇలాటి డైలాగ్ వదిలి, వున్న డాక్టర్ని వదిలించుకుని మరో డాక్టర్ని ఆశ్రయిస్తారు. కానీ, ఈ సిచుయేషన్ పూర్తిగా డిఫరెంట్! ఇక్కడ వాళ్ళకు తెలిసినంతవరకు నొప్పులు ఆగిపోయాయి. గర్భద్వారానికి వేయాల్సిన కుట్టు గురించి వాళ్ళు ఆలోచించడం లేదు.

"పూర్తి విశ్రాంతి కావాలని చెప్తోంటే... పేషంటు చేత అవన్నీ సర్దిస్తారా?" నర్స్ విసుక్కుంది.

ఇంతవరకు శ్రోతగా మిగిలిపోయిన నేను- పేషంటు తాలూకు వాళ్ళు నొచ్చుకున్న వైనం గ్రహించాను. వాళ్ళ మొండితనం నాకు అర్థమయింది.

"సరే... వెళ్లండి! కానీ, మరలా రావద్దు. అక్కడ దగ్గరలో వున్న డాక్టర్ దగ్గర గర్భసంచికి కుట్టు వేయించుకోండి. రావడం... పోవడం..."

నన్ను మాట పూర్తిచేయనీయలేదు వాళ్ళు-

"బస్ ఖర్చులకు ఎనకాడము లేమ్మా!"

నాకు కోపం రాలేదు... నవ్వొచ్చింది.

ఇది అజ్ఞానానికి పరాకాష్ట!

"డబ్బు గురించా మేడమ్ చెప్తున్నది? బస్ ప్రయాణం మంచిది కాదంటున్నారు. అందుకని అక్కడే చేయించుకోమంటున్నారు!" ఈసారి కాస్త మెత్తగా చెప్పింది శాంతి.

"ఆఁ... ఇన్నాళ్లు మీకాడ చూపించుకుని, ఏడకో ఎందుకెళ్తాం? మీ కాడకే వస్తాం... నొప్పులు రాగానే వచ్చేస్తాం."

నేను చోద్యం చూస్తున్నాను. నా బ్రెయిన్ మాత్రం ఎక్కడికెక్కడికో వెళ్లి తిరిగి వస్తోంది.

నర్స్ శాంతి– పోరాటం ఆపలేదు...

"అప్పుడు నొప్పులతో పూర్తిగా మునిగిపోయి వస్తే... బిడ్డ దక్కదు."

"అట్టా అంటే ఎట్టా? ఎట్టయినా చేసి తల్లినీ, బిడ్డనూ అమ్మగారే మాకివ్వాలి."

ఏడుపూ, నవ్వూ మిళితమై... విలక్షణమూ, అయోమయమూ అయిన ధ్వని నా గుండెల్లో నుండి తన్నుకొస్తోంది.

ఏ మాత్ర వేసి వీళ్ళను మార్చాలి?

ఉహూఁ... ఆ సృష్టికర్త దిగివచ్చినా వాళ్ళ మనసు మారదు.

"నొప్పులు తగ్గిపోయాయి.. డాక్టరమ్మ అనవసరంగా ఆపరేషన్ చేస్తానంటోంది!" అని– చూడడానికి వచ్చిన బంధువులు అన్న మాటలు వాళ్ళల్లో జీర్ణించుకుపోయి నట్టున్నాయి.

ప్రక్కింటివాళ్ళ మాట విన్నట్టు డాక్టర్ మాట వినరు. అదే... ఈ దేశం దౌర్భాగ్యం!

నేను నిశ్శబ్దంగా బిల్ వేసిచ్చాను...

ఆనందంగా బిల్ కట్టి వెళ్లిపోయారు వాళ్ళు.

కానీ... రెండు రోజుల్లోనే ఆఖరిశ్వాస తీస్తున్న 'నెల తక్కువ బిడ్డ'ను ఒళ్ళో పెట్టుకుని ఏడుస్తూ వచ్చారు వాళ్ళు.

నేను పశ్చాత్తాప పడ్డాను–

'వాళ్ళను మరికాస్త బలవంతం చేసుండాల్సింది నేను..!'

●

**'నేటి నిజం' దినపత్రిక ... 'స్వాతంత్ర్య దినోత్సవ ప్రత్యేక అనుబంధం' 2004లో ప్రచురితమైన కథ**